క్లుప్తంగా

28 నుంచి ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలు


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతాప్‌స్వామి

వెదురుకుప్పం: మండలంలోని మాకమాంబాపురం సమీపంలో ఉన్న ప్రసన్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వామివారి వార్షికోత్సవం, హనుమాన్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు ప్రతాప్ స్వామి తెలిపారు. గురువారం ఆలయం వద్ద ఉత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 నుంచి జూన్ ఒకటో తేదీ వరకు ప్రతి రోజూ ఆలయంలో ప్రత్యేక పూజలు, ధార్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. సీతారామ కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు చెప్పారు.

25న మండల మీట్

గంగాధర నెల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 25వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అనిత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నిబంధనల మేరకే సమావేశం జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

అనధికారిక పెట్రోల్ దుకాణాల సీజ్


పెట్రోల్ విక్రయిస్తున్న దుకాణాన్ని సీజ్ చేస్తున్న కమిషనర్

నగరి: మున్సిపల్ పరిధిలో అనధికారికంగా పెట్రోల్ విక్రయించే దుకాణాలను మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథ్ గౌడ్ సీజ్ చేశారు. చిత్తూరు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం అనధికారికంగా పెట్రోల్, డీజిల్ నిల్వ చేసి విక్రయించే దుకాణాలపై దాడులు చేశారు. కరకంతాపురం, సత్రవాడ ప్రాంతాల్లో షాపుల వద్ద పెట్రోల్, డీజిల్ విక్రయిస్తున్న షాపులను సీజ్ చేశారు. వారి వద్ద నుంచి పెట్రోల్, డీజిల్ స్వాధీనం చేసుకున్నారు.

చిత్రలేఖనంపై అవగాహన అవసరం


బొమ్మలు గీసిన విద్యార్థులతో సుబ్రమణ్యం

కార్వేటినగరం: విద్యార్థులు చిత్ర లేఖనంపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ సుబ్రమణ్యం తెలిపారు. గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణలో భాగంగా గురువారం విద్యార్థులకు చిత్రలేఖనంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రలేఖనం కూడా విద్యాబోధనలో ఒక భాగమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శంకర్ బాబు, రాఘవేంద్రరాజు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం


వృద్ధురాలికి కేక్ తినిపిస్తున్న భవన్‌తేజ్

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు గురువారం దాతలు అన్నదానం చేశారు. వైఎస్సార్ సీపీ జీడీనెల్లూరు ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి కుమారుడు భువన్‌తేజ్ జన్మదిన వేడుకలను సందర్భంగా వృద్ధాశ్రమంలో భువన్‌తేజ్ కేక్ కట్ చేసి, వృద్ధులకు పంచి పెట్టాడు. అలాగే స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులు మాట్లాడుతూ ప్రజాసేవ కోసం పరితపించే కుటుంబంలో పుట్టిన భువన్‌తేజ్ ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్ పాల్గొన్నారు.

గుండె పోటుతో ఎంపీటీసీ మాజీ సభ్యుడి మృతి


చంద్రశేఖర్ రాజు(ఫైల్)

పాలసముద్రం: మండలంలోని రాచపాళెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు చంద్రశేఖర్‌రాజు (65) గురువారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి స్వగ్రామంలో శుక్రవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. చంద్రశేఖర్‌రాజు మండలంలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని, అలాంటి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని డిప్యూటీ సీఎం కే నారాయణస్వామి అన్నారు. వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులంతా జీర్ణించుకోలేని సంఘటన అని అన్నారు.

నేత్ర పర్వం.. కంచి గరుడసేవ

- మాడ వీధుల్లో విహరించిన శ్రీకరిమాణిక్య స్వామివారు

నగరి: పట్టణ పరిధిలోని టీటీడీ ఆధీనంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్య స్వామి వారి ఆలయంలో గురువారం కంచి గరుడసేవ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. నేత్రపర్వంగా అలంకరించిన గరుడ వాహనంపై దేదీప్యమానంగా కరియ మాణిక్యస్వామిని మాడ వీధుల్లో ఊరేగించారు. తిరుమల తిరుపతి దేవస్థానం వారు ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉదయం ఆలయం నుంచి ప్రారంభమైన గరుడ వాహన సేవ సందర్భంగా కోలాటాలు, భజన బృందాలు, వేద పారాయణం, మంగళ వాయిద్యాలు, కళాకారుల నృత్య ప్రదర్శనల నడుమ స్వామివారు మాడవీధుల్లో విహరించారు. ఊరేగింపుగా వస్తున్న స్వామివారిని దర్శించుకోవడానికి మాడ వీధుల్లో భక్తులు బారులు తీరారు. ఫలపుష్పాలు, కొబ్బరి కాయలు సమర్పించి కర్పూర హారతులు పట్టారు. కుంకుమ ప్రసాదాలను అందుకున్నారు. మండుటెండను సైతం లెక్కచేయక ఊరేగింపులో పాల్గొన్న భక్తులకు ప్రతి వీధిలోనూ స్థానికులు మజ్జిగ, శీతల పానీయాలు, తాగునీరు అందించి శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం శ్రీవారిని ఆలయానికి చేర్చారు. నగరి పోలీసు శాఖ వారు, మున్సిపల్ శాఖ, టీటీడీ ఆలయ సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షణబాధ్యతలు చేపట్టారు.



నగరిలో కంచి గరుడ వాహనంపై విహరిస్తున్న కరియమాణిక్య స్వామి, కంచి గరుడ వాహనంపై కరివరదరాజ స్వామి

కంచి గరుడ వాహనంపై కరివరదుడు

మున్సిపల్ పరిధి సత్రవాడలో టీటీడీ ఆధీనంలోని కరివరదరాజ ఆలయంలో గురువారం కంచి గరుడ సేవ వైభవంగా నిర్వహించారు. కంచిలో ప్రాధాన్యం సంతరించుకొన్న గరుడసేవ అక్కడ వరదరాజ పెరుమాళ్‌కే చేస్తారు. అదే పేరుతో స్వామి కొలువైన ఆలయం కావడంతో ఈ ఉత్సవాలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. భారీ గరుడ వాహనంపై స్వామివారు పట్టుపీతాంబరధారిగా సుందర వదనంతో విహరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, కొబ్బరికాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చారు. మాడ వీధులలో సంచరించిన అనంతరం స్వామివారిని ఆలయంలో సేదదీర్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ఆలయాల డిప్యూటీ ఈఓ నాగరత్నం, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, ఆలయాధికారులు వెంకట రమణ, గుణశేఖర్, జానకి రామ్, ఎస్‌ఎస్‌ఎస్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ప్రధాన అర్చకులు నరసింహప్రసాద్, ధన్వంతరి ఆచార్యులు, బాలాజీ ఆచార్యులు, స్థానిక సలహా సభ్యులు పాల్గొన్నారు.


కంచి గరుడ వాహనంపై కరియ మాణిక్యస్వామి ఊరేగింపులో పాల్గొన్న టీటీడీ అధికారులు

సేవలందించిన స్కౌట్స్ అండ్ గైడ్స్

కంచి గరుడ సేవలో స్కౌట్స్ అండ్ గైడ్స్ వారు విశిష్ట సేవలు అందించారు. పుత్తూరు నుంచి 20 మంది, పిచ్చాటూరు భారతి విద్యా మందిర్ నుంచి 30 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్, రోవర్ అండ్ రేంజర్స్ విద్యార్థులు జిల్లా ఆర్గనైజింగ్ కమిషనర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్కౌట్స్ మాస్టర్ జి.దాము, నగరి రోవర్ స్కౌట్ లీడర్ రమేష్ నేతృత్వంలో విధులు నిర్వహించారు. మాడ వీధుల్లో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా, తోపులాటలు జరగకుండా పర్యవేక్షించారు. విద్యార్థులకు ఆలయ అధికారులు ప్రసాదాలు అందజేశారు. పిచ్చాటూరు గైడ్ కెప్టెన్ సుజాత, రేంజర్ లీడర్ భువనేశ్వరి, గైడ్స్ లీడర్ యువశ్రీ, రోవర్ లీడర్ జై కుమార్, పుత్తూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉన్నారు.


గరుడవాహన సేవలో పాల్గొన్న భక్తులు


ఊరేగింపులో కోలాట బృందం


గరుడ సేవలో సేవలు అందిస్తున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందం

అలరించిన జాతర వేషధారణలు


కుంభాలు తీసుకెళ్తున్న భక్తులు

నగరి: గంగ జాతర సంబరాలు గురువారం కూడా కొనసాగాయి. మండలంలోని కృష్ణారామపురంలో ఆనవాయితీగా గురువారం గంగజాతర వేడుకలను నిర్వహించారు. బుధవారం అమ్మవారిని ఊరేగింపుగా తీసుకువచ్చిన భక్తులు గురువారం జాతర వేడుకలు నిర్వహించారు. కరకంతాపురంలో గంగజాతర కుంభాల సమర్పణ, మొక్కుబడుల ప్రకారం చేపట్టే జాతర వేషధారణలు భక్తులను అలరించాయి.

బాలగురునాథీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పాలసముద్రం: మండలంలోని రాచపాళెంలో ఉన్న బాలగురునాథీశ్వరస్వామివారికి గురువారం పౌర్ణమి సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం పూజాసామగ్రిని మంగళ వాయిద్యాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి, అర్చకులకు అందజేశారు. వేదపండితులు భక్తులు తెచ్చిన పూజాసామగ్రితో స్వామివారికి విశేషాలంకరణ చేసి, ప్రత్యేక దీపారాధన, పూజలు చేశారు. పుత్రసంతానం, మాంగళ్య భాగ్యం లేని మహిళలు స్వామివారి ఆలయంలో పిండి దీపాలు వెలిగించి, మొక్కుకున్నారు.

ఉపాధి హామీలో పండ్ల తోటల పెంపకం

వెదురుకుప్పం: ఉపాధి హామీ పథకం ద్వారా పండ్లు, పూల తోటల పెంపకం చేపడుతున్నట్లు ఏపీఓ ఇందు గురువారం తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ కింద ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో పండ్లతోటలు, పూల తోటల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రధానంగా మామిడి, కొబ్బరి, జామ, అల్లనేరేడు, డ్రాగన్‌ఫ్రూట్, దానిమ్మ, నిమ్మ చెట్లు, రోజా, మల్లె పూల తోటలు, మునగ తోటలు పెంపకం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని చిన్న సన్నకారు రైతులు, 5 ఎకరాల భూమి ఉన్నా లేదా 5 ఎకరాల లోపు భూమి ఉన్న రైతులు అర్హులన్నారు. ఆసక్తి గల రైతులు దరఖాస్తులను తమ వద్ద గానీ, గ్రామీణ ఉపాధి హామీ క్షేత్ర సహాయకుల వద్ద సమర్పించాలన్నారు. రైతులు మొక్కలు తెచ్చుకున్నాక ఉపాధి హామీ పథకం నుంచి బిల్లులు చెల్లిస్తామన్నారు.

ఘనంగా శ్రీకార కొడి ఉత్సవం


ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళుతున్న నిర్వాహకులు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో మహాభారత ఉత్సవాలకు సంబంధించి గురువారం ఆలయంలో శ్రీకార కొడి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద పోటుచేను గ్రామస్తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బండి గోవర్ధన్‌రెడ్డి, రవికుమార్‌రెడ్డి, బొజ్జారెడ్డి, నరేష్‌రెడ్డి, మహిళలు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

చవటగుంటలో..

మండలంలోని చవటగుంటలో ఉన్న ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో గురువారం మహాభారత యజ్ఞానికి సంబంధించి శ్రీకార కొడి ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. జూన్ 19 నుంచి 30 వరకు మహాభారత ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలి



వేరుశనగ విత్తనకాయలను పంపిణీ చేస్తున్న ఏఓ హేమలత , పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు


వెదురుకుప్పం: రిజిస్ట్రేషన్ చేస్తున్న అధికారులు

కార్వేటినగరం: ప్రభుత్వం రైతులకు రాయితీపై అందిస్తున్న వేరుశనగ విత్తన కాయలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ హేమలత సూచించారు. గురువారం మండల కేంద్రంలోని సచివాయంలో వేరుశనగ విత్తన కాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం 40 శాతం రాయితీపై 30 కేజీల బస్తా రూ.1746కు అందజేస్తున్నామన్నారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో విత్తన కాయలు పంపిణీ జరుగుతుందన్నారు. రైతులు ఆధార్, పట్టాదారు పాసు పుస్తకం, బ్యాంకు పాసుపుస్తకం జెరాక్స్ కాపీ తీసుకువచ్చి విత్తనకాయలు పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు గాయత్రి, హేమాద్రి పాల్గొన్నారు.

2,860 మంది పేర్లు నమోదు

గంగాధర నెల్లూరు: మండలంలో వేరుశనగ విత్తన కాయల కోసం 2,860 మంది రైతులు ఆయా ఆర్బీకేల్లో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఏఓ వందన తెలిపారు. రైతుభరోసా కేంద్రాల్లో వేరుశనగ విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇంకా అవసరమైతే ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరితగతన తెప్పించే ప్రయత్నం చేస్తామని తెలిపారు.


రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న ఏడీ సౌభాగ్యలక్ష్మి

శుక్రవారం ఉదయం నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

వేరుశనగ విత్తన పంపిణీ ప్రక్రియ ప్రారంభం

వెదురుకుప్పం: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి వేరుశనగ సాగు చేసే రైతులకు రాయితీ ద్వారా విత్తన కాయలు పంపిణీ ప్రక్రియను అధికారులు గురువారం ప్రారంభించారు. ఈ క్రమంలో గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు అవసరమైన రైతుల వివరాలు సేకరించి రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. మండలంలోని రైతులు విత్తనాల కోసం ముందుగా ఆయా ఆర్బీకేల వద్ద రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని ఏఓ వనిత తెలిపారు. 40 శాతం రాయితీతో విత్తన కాయలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కే6 రకం విత్తన కాయలు 30 కేజీల బస్తా రూ. 1710, నారాయణి రకం 30 కేజీల బస్తా రూ. 1746కు అందజేస్తున్నట్లు తెలిపారు.

పేర్లు నమోదు చేసుకోండి

శ్రీరంగరాజపురం: అర్హులైన రైతులందరూ పేర్లు నమోదు చేసుకోవాలని నగరి వ్యవసాయ సహాయ సంచాలకురాలు సౌభాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట, నెలవాయి రైతు భరోసా కేంద్రాల్లో సబ్సిడీ వేరుశనగ విత్తన కాయల పంపిణీకి సంబంధించి జరుగుతున్న పేర్ల నమోదు ప్రక్రియను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ప్రభుత్వం రాయితీ వేరుశనగ విత్తనాలు రూ.1710 ధరతో అందించనున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులు సబంధిత రైతుభరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు మాత్రమే వేరుశనగ విత్తన కాయలు అందిస్తామని చెప్పారు. ఇప్పటికే రైతుభరోసా కేంద్రాలకు వేరుశనగ విత్తనాలు చేరాయన్నారు. శుక్రవారం నుంచి రైతులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

నేర నియంత్రణకే కార్డన్ సెర్చ్



సోదాలు చేస్తున్న పుత్తూరు పోలీసులు, సీజ్ చేసిన మోటార్ సైకిళ్లు

పుత్తూరు: నేర నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణ, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణే లక్ష్యంగా కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సీఐ ఓబులేశు తెలిపారు. స్థానిక పోలీసులు గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో, గేట్‌పుత్తూరులోని కామరాజునగర్‌లో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనుమానిత ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. సరైన రికార్డులు లేని 20 మోటార్ సైకిళ్లను సీజ్ చేశారు.

సింహ వాహనంపై కల్యాణ వేంకటేశ్వరుడు



ముత్యపు పందిరి వాహనంలో పార్థసారథిగా.., సింహవాహనంపై యోగముద్రలో దినకరునిగా..

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం జగతికి వెలుగునిచ్చే దినకరుని అవతారంలో సింహవాహనాన్ని అధిరోహించిన కల్యాణ వేంకటేశ్వరుడు రాత్రి ఆబాల భూపాలాన్ని సంరక్షించే కృష్ణావతరంలో ముత్యపుపందిరి వాహనంలో ఉభయనాంచారులతో గ్రామోత్సవాలలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్య పూజా కార్యక్రమాలతో పాటు నిర్మిత హోమశాలలో ప్రత్యేక హోమాలను పూర్తి చేశారు. తొలిగంటతో నైవేద్య సమర్పణ చేశారు. 7.30 గంటలకు వెలుగును నింపే దినకరునిగా యోగముద్రలో సూర్యదేవునిగా సింహవాహనంపై సుగంధ పుష్పమాలికలు, స్వర్ణాభరణాలను అలంకరించుకుని స్వామి అధిష్టించారు. మేళతాళాలు, వేద మంత్రాలు, భక్త బృందాల కోలాటాలు, డప్పుల వాయిద్యాల మధ్య గోవింద నామస్మరణలతో స్వామివారి ఊరేగింపు గ్రామ వీధుల్లో కొనసాగింది. మహిళలు కర్పూర హారతులు పట్టారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవ మూర్తులు ఉభయ నాంచారులతో స్నపన తిరుమంజనంలో సేదదీరారు.

పార్థసారథిగా ముత్యపుపందిరిపై..

సాయంత్రం పూజలను అర్చకులు పూర్తి చేశారు. కురుక్షేత్రంలో పార్థునికి జ్ఞానబోధ చేసిన కృష్ణావతారంలో రుక్మిణీ సమేతుడై ఊంజల్‌సేవలో పాల్గొన్నారు. రాత్రి 7.30 గంటలకు ముత్యాలతో, సుగంధ పుష్పమాలికలతో సుందరంగా అలంకరించిన ముత్యపు పందిరి వాహనాన్ని అధిరోహించిన ఉత్సవర్లు ఊరేగింపుగా బయలుదేరాలు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించిన అర్చకులు భోగశ్రీనివాసునికి పవళింపు సేవను నిర్వహించారు. డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ అధికారి నాగరాజు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్య, శ్రీనివాసరాఘవ భట్టాచార్య, నరసింహ భట్టాచార్య, ఆర్జితం అధికారి భరత్, ఇంజినీరింగ్ ఏఈ గురుప్రసాద్ పాల్గొని పర్యవేక్షించారు. ఉత్సవాల్లో నాలుగో రోజు శుక్రవారం ఉదయం కల్పవృక్ష వాహనంపై, రాత్రి సర్వభూపాల వాహనంపై భక్తులకు స్వామి వారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.

అర్ధగిరి క్షేత్రంలో ఘనంగా బుద్ధ పౌర్ణమి


సుదర్శన హోమం చేస్తున్న అర్చకులు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో గురువారం పౌర్ణమి వేడులకు భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఉదయం అర్చకులు స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. అనంతరం వివిధ రాష్ట్రాల భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. భక్తులకు ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

బుద్ధ పౌర్ణమి పురస్కరించుకుని ఆలయంలోని మండపంలో అర్చకులు స్వామికి సుదర్శన హోమం చేశారు. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. రాత్రి ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తుల కాలక్షేపం కోసం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ సురేంద్ర రెడ్డి, ఈఓ హనుమంతురావు పర్యవేక్షించారు.

వేలంలో ఆలయానికి రూ.5.55 లక్షల ఆదాయం

గురువారం ఆలయంలో నిర్వహించిన వేలంలో రూ.5.55 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. ఎండోమెంట్ అధికారి సుమనప్రియ ఆధ్వర్యంలో వేలం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఆలయంలో తలనీలాల సేకరణకు గుడియాత్తంకు చెందిన యోగానందం వేలంలో రూ.4.55 లక్షలకు, అలాగే కొబ్బరిచిప్పల సేకరణ హక్కును పత్రపల్లెకు చెందిన నాగమ్మ వేలంలో దక్కించుకున్నట్లు చెప్పారు.

26 నుంచి ఉచిత యోగా శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్: నగరంలోని గిరింపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో 10 రోజుల పాటు ఉచిత యోగా శిక్షణ ఇవ్వనున్నట్లు యోగాచార్యులు నరేంద్రకుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిద్ధ సమాధి యోగా ఆధ్వర్యంలో శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు చెప్పారు. శిక్షణ తరగతులు ఈ నెల 26వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఈ శిక్షణలో యోగాసనాలు, శారీరక వ్యాయామాలు, ప్రాణాయామం, ధ్యానం, స్వీయ చిత్రలేఖనం, నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంపుదల, కథలతో బాధ్యతలు పెంపొందించనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణను నగరంలోని విద్యార్థులు, యువత, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 82476 09140 ను సంప్రదించాలని కోరారు.